మల్లన్న కల్యాణంలో
గందరగోళం
- మల్లన్నకు తగ్గిన కట్నాలు
- కానరాని తలంబ్రాల పంపిణీ, తాగునీటి సరఫరా
5 లో..

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సిద్దిపేట 3
సోమవారం 8 జనవరి 2024





పట్టువస్త్రాలు, తలంబ్రాలను సమర్పించిన మంత్రి కొండా సురేఖ

రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు, తలంబ్రాలను అందజేశారు. అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. బీసీ, రవాణాశాఖమంత్రి పొన్నం ప్రభాకర్, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డితో కలిసి ఆమె వాటిని కల్యాణమండపానికి తీసుకొచ్చారు. మాంగళ్యధారణ అనంతరం స్వామివారిని దర్శించుకుని మల్లన్న ఆలయాన్ని సందర్శించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. మంత్రి కొండా సురేఖ కుటుంబసభ్యులతో కలిసి పట్నంవేసి మొక్కు తీర్చుకున్నారు. అంతకుముందు యాదవపూజారులతో పాటు గ్రామసర్పంచ్ సార్ల లత, ఉపసర్పంచ్ కొండాశ్రీధర్ దంపతులు సాంప్రదాయం ప్రకారం పట్టు వస్త్రాలను తీసుకొచ్చారు.



కల్యాణాన్ని తిలకిస్తున్న మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్

కమనీయం.. రమణీయం
మల్లన్న కల్యాణం



మల్లన్నకు దృష్టికుంభం పెట్టి బలిహరణ చేస్తున్న వీరశైవార్చకులు

తిలకించి పులకించిన భక్తజనం

- హాజరైన దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ
- బీసీ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఇతర ప్రముఖులు
- వెల్లివిరిసిన ఆధ్యాత్మిక వాతావరణం
- జనసంద్రంగా ఆలయ పరిసరాలు
- భక్తిపారవశ్యంలో ఓలలాడిన కొమురవెల్లి



కల్యాణ వేదిక వద్ద ఆసీనులైన ప్రజాప్రతినిధులు, వీఐపీలు



కల్యాణ వేదిక వద్దకు వస్తున్న వీరశైవ పీఠాధిపతి సిద్ధలింగ శివాచార్య మహాస్వామి

చేర్యాల, జనవరి 7: ముక్కోటి దేవతలు, పంచభూతాల సాక్షిగా, వీరశైవ పండితుల మంత్రోచ్చారణలు, భక్తుల జయజయధ్వానాలు, మేళతాళాల చప్పుళ్లు, మంగళవాయిద్యాల నడుమ కొమురవెల్లి మల్లికార్జున స్వామి కేతలమ్మ, మేడలాదేవీలను వివాహమాడాడు. సనాతన వీరశైవాగమ శాస్త్రం ప్రకారం మార్గశిర మాసం చివరి ఆదివారం రోజును పురస్కరించుకుని ఆలయప్రాంగణంలోని తోటబావి ఆవరణలో ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన కల్యాణవేదికపై ఈవో బాలాజీశర్మ ఆధ్వర్యంలో నభూతో నభవిష్యత్తు అన్న చందంగా కమనీయంగా, రమణీయంగా కైంకర్యం నిర్వహించారు.



మల్లన్న నిజరూప దర్శనం

కల్యాణ క్రతువు

వీరశైవార్చకులు మల్లికార్జునస్వామి, కేతమ్మ, మేడలాదేవీల ఉత్సవ విగ్రహాలను పల్లకీలో ఊరేగిస్తూ మహిళల కోలాటాల నడుమ భాజా భజంత్రీల మధ్య కల్యాణ మంటపానికి తీసుకొచ్చారు. వరుడు మల్లికార్జునస్వామి తరఫున కన్యాగ్రహీతలుగా పడిగన్నగారి మల్లికార్జున్ దంపతులు, అమ్మవార్లు గొల్ల కేతమ్మ, మేడలాదేవీల తరఫున కన్యాదాతలుగా మహదేవుని మనోహర్ దంపతులు వ్యవహరించారు. వీరశైవ ఆగమపండితులు గణపతిపూజ, స్వస్తివాచనం, మంటప దేవతారాధన ప్రతిష్ఠ, పాదార్చన, భాషింగ ధారణ, వస్త్రాలంకరణ, మధుసంపర్క స్వీకరణ, గూడజీరశిఖారాధన, కన్యాదానం, మంగళసూత్రధారణ జరిపారు. అనంతరం ముత్యాల తలంబ్రాలు, ఒడిబియ్యం పోశారు. ప్రత్యేక పూల అలంకరణ వేదికపై పట్టువస్త్రాలతో ధగధగలాడుతున్న దేవతామూర్తులు భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారి కల్యాణ నిర్వహణ తీరు, విశేషాలను డాక్టర్ మహంతయ్య, షశిభూషణ సిద్ధాంతి చేసిన వ్యాఖ్యానం భక్తులను అలరించింది. "మల్లన్నకీ జై.." అంటూ భక్తులు చేసిన జయజయధ్వానాలతో ఆలయ పరిసరాలు ప్రతిధ్వనించాయి. దేవదేవుల నామస్మరణలో పులకించిపోయారు.



జయజయధ్వానాలు చేస్తున్న భక్తులు

గర్భాలయంలోనూ

గర్భాలయంలోనూ మల్లన్నకు శాస్త్రోక్తయుక్తంగా కల్యాణాన్ని నిర్వహించారు. కన్యాదాతలుగా మహదేవుని సాంబయ్య దంపతులు, కన్యాగ్రహీతలుగా పడిగన్నగారి వంశస్థులైన పడిగన్నగారి మల్లయ్య దంపతులు వ్యవహరించారు. ఏకాదశరుద్రాభిషేకం పూజలు నిర్వహించారు.

గంటన్నరపాటు కల్యాణం ఆలస్యం

మల్లన్న కల్యాణం 10-45 గంటలకు జరగాల్సి ఉండగా, 12-28గంటలకు మాంగల్యధారణ చేశారు. ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్, మాజీ మంత్రి చామకూర మల్లారెడ్డి హాజరైనా దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఆలస్యంగా రావడంతో కల్యాణ కైంకర్యం నిర్ణీత సమయాని కన్నా గంటన్నరపాటు ఆలస్యమడంతో భక్తులు విస్మయం వ్యక్తంచేశారు.

సంప్రదాయబద్ధంగా దృష్టికుంభం, బలిహరణ

తెల్లవారుజామున 4.30గంటలకు గర్భాలయ మండపంలోని వీరభద్రుడికి బలిహరణ చేసి దృష్టికుంభాన్ని ఘనంగా నిర్వహించారు. వీరశైవార్చకులు అన్నంరాశులపై గుమ్మడికాయలు నెలకొల్పి దండకాలతో హోరెత్తించిన అనంతరం గుమ్మడికాయను బలిచ్చి స్వామివారి తొలిదర్శనాన్ని ప్రారంభించారు. మల్లన్నకు చత్రకన్ను అమర్చి శతరుద్రాభిషేకం పూజలు నిర్వహించారు.

హాజరైన ప్రముఖులు

కల్యాణానికి మాజీమంత్రి మల్లారెడ్డి, కలెక్టర్ ప్రశాంత్ జీవన్‌పాటిల్, జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, సిద్దిపేట జిల్లా జడ్పీచైర్మన్ వేలేటి రోజాశర్మ, జడ్పీటీసీలు సిలివేరు సిద్ధప్ప, గిరి కొండల్‌రెడ్డి, మల్లన్న ఆలయ పునరుద్ధరణ కమిటీ ఛైర్మన్ పర్పాటకం లక్ష్మారెడ్డి, డైరెక్టర్లతో పాటు ఎంపీపీలు తలారి కీర్తన, బద్దిపడిగ కృష్ణారెడ్డి, వుల్లంపల్లి కరుణాకర్, జిల్లా, నియోజకవర్గ, మండలస్థాయి నేతలు, సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు హాజరయ్యారు.



మల్లన్నను వేడుకుంటున్న భక్తురాలు



రాజగోపుర ఆవరణలో భక్తజనసందోహం

హిజ్రాగా మారి.. భార్యకు వేధింపులు

- బిడ్డను అప్పగించాలని తరచూ వాగ్వాదం
- పరువు తీస్తున్నాడని రగిలిపోయిన భార్య
- సన్నిహితుడితో కలిసి భర్త హత్యకు స్కెచ్
- ఓ వ్యాపారితో రూ.18 లక్షలకు ఒప్పందం
- గత నెలలో హత్య.. ఛేదించిన సిద్దిపేట పోలీసులు

5 లో..

మంత్రి పొన్నంను కలిసిన పట్టు రైతులు



మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న పట్టు రైతులు

చిన్నకోడూరు, జనవరి 7 : తమ సమస్యలను పరిష్కరించేందుకు చొరవ తీసుకోవాలని పట్టు రైతులు బీసీ సంక్షేమ, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కోరారు. చిన్నకోడూరు మండలం చంద్లాపూర్ శివారులోని రంగనాయకసాగర్ గెస్ట్ హౌస్‌లో ఆదివారం ఆయనకు వినతిపత్రం అందజేశారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరిస్తామని మంత్రి హామీ ఇచ్చినట్లు రైతులు తెలిపారు. కార్యక్రమంలో పట్టు రైతుల సహకార సంఘం ప్రతినిధులు ఐలయ్య, నర్సింహులు, వెంకటరామిరెడ్డి, రాజు, యాదగిరి, దేవయ్య, శ్రీనివాస్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

మొత్తం దరఖాస్తులు 3,76,387

- జిల్లాలో ముగిసిన 'ప్రజా పాలన'
- సంక్షేమ పథకాలకు విశేష స్పందన
- ఇక దరఖాస్తులన్నీ ఆన్‌లైన్‌కు
- 552 మంది డాటా ఆపరేటర్లకు శిక్షణ
- మళ్లీ 4 నెలల తర్వాత దరఖాస్తుల స్వీకరణ



ప్రజాపాలన దరఖాస్తులను ఆన్‌లైన్ చేయడానికి నియమించిన డాటా ఆపరేటర్లకు శిక్షణ కార్యక్రమం

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సిద్దిపేట, జనవరి 7: సంక్షేమ పథకాల కోసం దరఖాస్తులు స్వీకరించడానికి కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమం ముగిసింది. డిసెంబరు 28 నుంచి ఈనెల 6వ తేదీ వరకు గ్రామాలు, పట్టణాల్లో దరఖాస్తులు స్వీకరించారు. అధికార యంత్రాంగమంతా ఈ దరఖాస్తుల స్వీకరణపై దృష్టి పెట్టారు. ఎన్నికల్లో ప్రకటించిన ఆరు గ్యారంటీలను అమలు చేయడానికి అర్హుల ఎంపికకు దరఖాస్తులను కోరిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే పెద్దసంఖ్యలో ప్రజలు స్పందించి దరఖాస్తుల్లో పేర్కొన్న 5 గ్యారంటీల్లో తమ అర్హత ప్రకారం నమోదు చేశారు. మళ్లీ 4 నెలల తర్వాత దరఖాస్తుల స్వీకరణ ఉంటుందని అటు ప్రభుత్వం, ఇటు అధికారులు పేర్కొన్నారు.

వెల్లువెత్తిన దరఖాస్తులు..

జిల్లాలోని 499 గ్రామపంచాయతీలు, 5 మున్సిపాలిటీల్లోని వార్డుల్లో ఈ దరఖాస్తులను స్వీకరించారు. దరఖాస్తు పత్రాలను ఉచితంగా అందజేశారు. గృహజ్యోతి, ఇందిరమ్మ ఇండ్లు, మహాలక్ష్మీ, చేయూత, రైతు భరోసా పథకాలకు సంబంధించిన వివరాలను పొందుపరిచేలా వీటిని రూపొందించారు. రేషన్ కార్డు, ఆధార్ కార్డును జత చేయాలని సూచించారు.

దరఖాస్తు చేసిన వెంటనే రశీదు సైతం అందజేశారు. ఆరు గ్యారంటీలపై విస్తృత ప్రచారం చేయడంతో ఉపాధి కోసం వలస వెళ్లినవారు కూడా గ్రామాలకు చేరుకొని దరఖాస్తులు సమర్పించారు. రేషన్ కార్డులు లేనివారు సైతం కదిలివచ్చారు. 3,76,387 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు ధ్రువీకరించారు. కాగా జిల్లాలో 2.91 లక్షల రేషన్ కార్డులు ఉండగా ఇంతకు అదనంగా 80వేలకు పైగా దరఖాస్తులు వచ్చాయి. ఈ లెక్కన జిల్లాలో మరో 80వేల కొత్త రేషన్ కార్డులు అవసరమని తెలుస్తోంది.

వివరాలన్నీ ఆన్‌లైన్

దరఖాస్తులను ఆన్‌లైన్ చేయడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఒక్కో గ్రామానికి ఒక డేటా ఎంట్రీ ఆపరేటర్‌ను, అదే విధంగా మున్సిపాలిటీల్లోని ఒక్కో వార్డుకు ఒక ఆపరేటర్‌ను నియమించారు. వీరు వెను వెంటనే దరఖాస్తులను ఆన్‌లైన్ చేసేలా శిక్షణ ఇచ్చారు. మొత్తంగా జిల్లాలో 552 మంది డాటా ఎంట్రీ ఆపరేటర్లతోపాటు 26 మంది మాస్టర్ ట్రైనర్లు దరఖాస్తులన్నీ ఆన్‌లైన్ చేసేవరకు విధుల్లో ఉంటారు. ఏ లబ్ధిదారు ఏయే పథకాలకు దరఖాస్తు చేశారనే విషయాన్ని కూడా ఆన్‌లైన్ పూర్తయ్యాకనే తేటతెల్లమవుతోంది. అందుకే ఈ ప్రక్రియను వేగవంతం చేయనున్నారు. మండలాల వారీగా ఇందుకు సంబంధించిన కంప్యూటర్లు, ప్రింటర్లు, ఇంటర్నెట్ కనెక్షన్, ఇతర సౌకర్యాలను కల్పించాలని ఇప్పటికే ఆదేశాలు వచ్చాయి.

మండలం	దరఖాస్తులు
అక్కన్నపేట	16202
హుస్నాబాద్	8593
కోహెడ	14800
దూలిమిట్ట	6352
మద్దూరు	9920
బెజ్జంకి	12581
సిద్దిపేట అర్బన్	8127
సిద్దిపేట రూరల్	11479
నారాయణరావుపేట	8227
చిన్నకోడూరు	16932
నంగునూరు	14815
చేర్యాల	14763
కొమురవెల్లి	7273
అక్బరుపేట-భూంపల్లి	10395
దౌల్తాబాద్	10712
దుబ్బాక	13033
గజ్వేల్	19952
మిరుదొడ్డి	8611
రాయపోల్	8670
తొగుట	8769
జగదేవ్‌పూర్	16210
కొండపాక	10567
కుకునూరుపల్లి	6361
మర్కూక్	9017
ములుగు	13324
వర్గల్	13891
మున్సిపాలిటీలు	**దరఖాస్తులు**
సిద్దిపేట	40865
గజ్వేల్	12991
చేర్యాల	5664
దుబ్బాక	8713
హుస్నాబాద్	8578
మొత్తం	3,76,387

రాత్రి 11:30 కాగానే..
హైవేపై దాబాలు బంద్

- ఇసుక అక్రమ తవ్వకాలపై ఉక్కుపాదం
- డ్రగ్స్, గంజాయి స్మగ్లింగ్‌పై నిఘా
- బేసిక్ పోలీసింగ్‌కు ప్రాధాన్యం


ఎస్పీ చెన్నూరి రూపేశ్

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి), జనవరి 7 : సంగారెడ్డి జిల్లాలోని హైవేలపై ఇతర ప్రాంతాలలో ఉన్న దాబాలన్నీ రాత్రి 11.30 గంటలు కాగానే మూసీ వేయాలని జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేశ్ దాబాల యాజమాన్యాలను ఆదేశించారు. ఇందుకు తగిన చర్యలు చేపట్టాలని కూడా ఆయన పోలీసు అధికారులకు ఆదేశాలిచ్చారు. హైదరాబాద్‌లో హోటళ్లు, పబ్‌లు బంద్లైనా, సంగారెడ్డి సమీపంలోని హైవేలపై దాబాలు తెరిచే ఉంటున్నాయి. ఈ దాబాలలో మద్యం కూడా అందుబాటులో ఉంటున్నది. అందుకే అర్ధరాత్రి సమయంలో హైదరాబాద్ తదితర ప్రాంతాల నుంచి పలువురు వాహనాల్లో ఇక్కడికి వచ్చి, మద్యం సేవించడం, డిన్నర్ చేయడం జరుగుతున్నది. దీని కారణంగా ప్రమాదాలు కూడా ఎక్కువగానే జరుగుతున్నాయి. ఈ అంశాలన్నిటినీ పరిగణనలోకి తీసుకున్న ఎస్పీ రూపేశ్ శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా హైవేలపై దాబాలన్నింటినీ రాత్రి 11.30 గంటలు కాగానే మూసివేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఎవరో ఒక్కరి లాభం కోసం వందలాది మందిని ఇబ్బంది పెట్టడం సరికాదన్న అభిప్రాయంతోనే ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు.

ఇసుక అక్రమ తవ్వకాలపై ఉక్కుపాదం

సంగారెడ్డి ప్రాంతంలో జరుగుతున్న అక్రమ ఇసుక తవ్వకాలపై ఎస్పీ ఉక్కుపాదం మోపారు. ఇటీవలే కంది మండలం బ్యాతోలు, ఎర్ధనూరు తదితర ప్రాంతాలలో అక్రమ ఇసుక తవ్వకలపై దాడులు చేయించారు. సాధారణంగా ఇదంతా మైనింగ్‌శాఖ అధికారులు చేయాల్సి ఉండగా, శాంతి భద్రతల దృష్ట్యా తామే చేయాల్సి వస్తుందని ఆయన పోలీసు అధికారులతో అన్నట్టు తెలిసింది. అలాగే జిల్లాలోని పలు విద్యా సంస్థల ప్రాంతాలలో గంజాయి, డ్రగ్స్ అమ్మకాలపై ఆయన నిఘా వేయించారు. గంజాయి, డ్రగ్స్ విద్యార్థుల పట్ల మహమ్మారిలా మారిందని, వీటి రవాణాను అరికట్టేందుకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ఆయన పోలీసు అధికారులకు సూచించారు.

త్వరలో రోడ్డు భద్రతా సమావేశం

రోడ్డు భద్రతా సమావేశాన్ని త్వరలో నిర్వహించేలా చూడాలని ఎస్పీ రూపేశ్ జిల్లా కలెక్టర్ వి.క్రాంతిని కోరినట్టు తెలిసింది. జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ఉన్న ఈ కమిటీ సమావేశమై ట్రాఫిక్ నియంత్రణ, ప్రమాదాల నివారణ వంటి అంశాలపై నిర్ణయాలు తీసుకుంటుంది. సదాశివపేట, జహీరాబాద్‌లకు ఉన్న బైపాస్ రోడ్డు సౌకర్యం జిల్లా కేంద్రమైన సంగారెడ్డికి లేకపోవడం ట్రాఫిక్ నియంత్రణకు ఆటంకాలు కలిగిస్తున్నది. ఈ అంశాలన్నీ పరిగణనలోకి తీసుకున్న ఎస్పీ రూపేశ్ సంగారెడ్డి క్రాస్ రోడ్డు నుంచి హైదరాబాద్‌కు వెళ్లే హైవేకు ఫ్రీ జోన్ ఏర్పాటు చేయించారు. జిల్లాలో ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన అవసరమైన చర్యలను ఆయన పోలీసు అధికారులకు సూచించారు. బేసిక్ పోలీసింగ్ అమలు ప్రధాన కర్తవ్యంగా ఉండాలని, అందులో భాగంగా శాంతి భద్రతల పరిరక్షణ, ప్రమాదాల నివారణ, నేరాల అదుపు, కేసుల పరిష్కారం వంటి వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్పీ రూపేశ్ పోలీసు అధికారులకు ఆదేశాలిచ్చారు.

గురుకులంలో ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య


బేగరి స్వప్న మృతదేహం, స్వప్న(ఫైల్)

జహీరాబాద్, జనవరి 7: సంగారెడ్డి జిల్లాలోని ఓ గురుకులంలో ఇంటర్ విద్యార్థిని బలవన్మరణానికి పాల్పడింది. ఈ ఘటన జహీరాబాద్ పట్టణ సమీపంలోని రంజోల్ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో ఆదివారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. జహీరాబాద్ మండలం తూంకుంట గ్రామానికి చెందిన బేగరి స్వప్న(17) గురుకుల విద్యాలయంలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. ఈ క్రమంలో ఆదివారం కళాశాలలో ఓ గదిలో స్వప్న ఫ్యానుకు ఉరేసుకుంది. ఆమె ఆత్మహత్య చేసుకోవడానికి గల కారణాలు తెలియరాలేదు. తోటి విద్యార్థులతో గొడవలు లేదా మరేదైనా కారణాల వల్ల స్వప్న ఈ అఘాయిత్యానికి పాల్పడిందా అన్న కోణంలో పోలీసులు ఆరా తీస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జహీరాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు. స్వప్న కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. జహీరాబాద్ ఎమ్మెల్యే కె.మాణిక్‌రావు కళాశాలను సందర్శించి విద్యార్థిని మృతిపై విచారం వ్యక్తం చేశారు. స్వప్న తల్లిదండ్రులతో కలిసి విద్యార్థి సంఘాల నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు, నాయకులు కళాశాల ఎదుట ఆందోళనకు దిగారు. స్వప్న మరణానికి న్యాయం జరిగే వరకు ఇక్కడి నుంచి కదలబోమని, విద్యార్థులను వేధింపులకు గురిచేసే ఉపాధ్యాయులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పోలీసులు జోక్యం చేసుకుని న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చి ఆందోళన విరమింపజేశారు.

ఇంటి ముందు నిలిపిన కారు దహనం

చేగుంట, జనవరి 7: ఇంటి ముందు ఉన్న కారును గుర్తు తెలియని దుండగులు దహనం చేశారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. చేగుంటకు చెందిన శ్రీనివాస్‌రెడ్డి తన మారుతి ఆల్టో కారును ఇంటి ముందు నిలిపాడు. శనివారం అర్ధరాత్రి గుర్తుతెలియని దుండగులు కారు టైర్లను చోరీ చేసి నిప్పంటించినట్లు అనుమానిస్తున్నారు. గతంలో కూడా ఈ పరిసర ప్రాంతాల్లో ద్విచక్ర వాహనాల చోరీకి పాల్పడ్డారని స్థానికులు తెలిపారు. ఈ విషయమై శ్రీనివాస్‌రెడ్డి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

విద్యుదాఘాతంతో మెడికల్ షాపు దగ్ధం

మెదక్ అర్బన్, జనవరి 7: విద్యుదాఘాతంతో ఓ మెడికల్ షాపులో మంటలు చెలరేగడంతో మందులు కాలిబూడిదయ్యాయి. జేఎన్ రోడ్డులో సాయికృష్ణ మోర్ మెడికల్ షాపును సాయికృష్ణగౌడ్ కొంతకాలంగా నిర్వహిస్తున్నాడు. రాత్రి దుకాణంలో అకస్మాత్తుగా మంటలు చెలరేగి దట్టమైన పొగలు అలుముకున్నాయి. పక్కనే ఉన్న ఆసుపత్రి సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. దాదాపు రూ.6 లక్షల వరకు ఆస్తినష్టం జరిగిందని బాధితుడు సాయికృష్ణ తెలిపాడు.

చిన్నజీయర్ స్వామిని కలిసిన మహిపాల్‌రెడ్డి దంపతులు


చినజీయర్ స్వామి ఆశీస్సులు తీసుకుంటున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి దంపతులు

పటాన్‌చెరు, జనవరి 7: పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెంమహిపాల్‌రెడ్డి, ఆయన సతీమణి యాదమ్మ ఆదివారం ప్రముఖ ఆధ్యాత్మికవేత్త శ్రీ త్రిదండి చినజీయర్ స్వామిని కలిసి ఆశీస్సులు తీసుకున్నారు. హైదరాబాద్ శివారులోని ముచ్చింతల్ శ్రీ సమతామూర్తి ఆధ్యాత్మిక కేంద్రంలో ఆయన్ను కలుసుకున్నారు. మూడోసారి పటాన్‌చెరు ఎమ్మెల్యేగా ఎన్నికైన సందర్భంగా చినజీయర్ స్వామిని కలిసి ఆశీర్వాదం పొందారు. ఈ సదర్భంగా నియోజకవర్గంలో 180కి పైగా ఆలయాల నిర్మాణం. పురాతన ఆలయాలను పునరుద్ధరించే అంశాలను స్వామిజీకి ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి వివరించారు. ఎమ్మెల్యే నిర్వహిస్తున్న ధార్మిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలకు తనవంతు తోడ్పాటు, ఆశీస్సులు ఉంటాయని స్వామిజీ తెలిపారు. ఎమ్మెల్యే వెంట ఆయన సోదరుడి కుమారులు సంతోష్‌రెడ్డి, సందీప్‌రెడ్డి, తెల్లాపూర్ మున్సిపల్ కౌన్సిలర్ లచ్చిరాంనాయక్, దాసు తదితరులున్నారు.




తోటబావి ప్రాంగణం సమీపంలోని హోటల్‌లో టీ తాగుతున్న మాజీ మంత్రి చామకూర మల్లారెడ్డి, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి



లిఫ్ట్‌ను ప్రారంభిస్తున్న బబ్బూరి బాలకృష్ణ





భక్తుల రద్దీతో కిక్కిరిసిన ఆలయ ప్రాంగణం, దేవతామూర్తులకు తలంబ్రాలు పోస్తున్న వీరశైవార్చకులు

మల్లన్న కల్యాణంలో గందరగోళం

- ఈసారి మల్లికార్జునస్వామికి తగ్గిన కట్నాలు
- కానరాని తలంబ్రాల పంపిణీ
- కల్యాణంలో తాగునీటికి ఇబ్బందులు

చేర్యాల, జనవరి 7 : కొమురవెల్లి మల్లన్న కల్యాణం సందర్భంగా అధికారులు ముందస్తు ఏర్పాట్లు చేపట్టినా గతానికి భిన్నంగా ఈయేడు గజిబిజి గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. కల్యాణానంతరం స్వామివారిని దర్శించుకుని వీఐపీలతో పాటు భక్తులు తోసుకువస్తున్న క్రమంలో బారికేడ్లను ఏర్పాటుచేసి ముందస్తుగా అప్రమత్తంగా వ్యవహరించారు. కానీ అమాత్యుల దర్శనానంతరం చివరి సమయంలో చేతులెత్తేయడంతో ఇరుపక్కల నుంచి వీఐపీలతో పాటు భక్తులు వేదికపైకి బారికేడ్లను తొలగించుకుని తోసుకువచ్చారు. అంతకుముందు మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్‌గౌడ్ రాక కోసం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ మంత్రి మల్లారెడ్డి తోటబావి ప్రాంగణం వద్ద ఎదురుచూశారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ మధ్య ప్రొటోకాల్ రగడ కొనసాగగా ఇరువర్గాల క్యాడర్ మోహరించింది. మంత్రులు చేరుకున్న అనంతరం ఎమ్మెల్యే పల్లా పుష్పగుచ్ఛం అందించేందుకు వెళ్లగా ఇరువర్గాల క్యాడర్ తోసుకువచ్చారు. పూర్ణకుంభంతో స్వాగతం పలికేందుకు వచ్చిన అర్చకులను సైతం పోలీసులు, కార్యకర్తలు పక్కకు నెట్టేయడంతో కొద్దిసేపు గందరగోళం నెలకొన్నది.

గతేడాది కంటే చదివింపులు తక్కువే

కన్యాదాన సమయంలో ప్రజాప్రతినిధులు కట్నాలు చదివిస్తారు. గతేడాది మాజీ మంత్రులు హరీశ్‌రావు రూ.1,00,116, తలసాని శ్రీనివాస్‌యాదవ్ రూ.1,00,116, చామకూర మల్లారెడ్డి రూ.1,00,100, కొత్త ప్రభాకర్‌రెడ్డి రూ.50,116, ఎర్రోళ్ల శ్రీనివాస్ రూ.25,116, వంటేరు ప్రతాప్‌రెడ్డి రూ.25,116, తలసాని సోదరుడు శంకర్‌యాదవ్ రూ.50,116 కట్నంగా ప్రకటించారు. ఈసారి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, బీసీ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, మాజీ మంత్రి



కల్యాణవేదికపైకి దూసుకొచ్చిన భక్తులు

చామకూర మల్లారెడ్డి, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి రూ.5,116 చొప్పున కట్నం ప్రకటించారు. కొండా సురేఖ తనయురాలు సుస్మితాపటేల్ అందరికన్నా అధికంగా రూ.21వేలు కట్నం చదివించారు. ఇక కల్యాణానికి వచ్చిన భక్తులందరికీ తలంబ్రాలు అందించాలని, గతంలోకన్నా అదనంగా అన్నప్రసాద వితరణ చేపట్టాలని ఇటీవల దేవాదాయ శాఖ కమిషనర్ అనిల్‌కుమార్ ఆలయాధికారులను ఆదేశించారు. నీటిసౌకర్యం కల్పించాలని కలెక్టర్ ప్రశాంత్‌జీవన్ పాటిల్ సూచించారు. కానీ ఆలయవర్గాలు తలంబ్రాలు ఎవరికీ అందిచలేదు. ఉడికీ, ఉడకని భోజనాన్ని అందించారు. తాగునీటి వసతి కల్పించకపోవడంతో భక్తులు ఇబ్బందులుపడ్డారు.

లిఫ్ట్ ప్రారంభించిన దాత

ఆలయానికి దర్శనార్థం వచ్చే దివ్యాంగులు, వృద్ధులకు ఇబ్బందులు తీర్చేందుకు రూ.9లక్షల వ్యయంతో ఏర్పాటు చేయించిన లిఫ్ట్‌ను దాత బబ్బూరి బాలకృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయాధికారులు అతడికి స్వామివారి ప్రసాదం అందించి సత్కరించారు.

భక్తుల బంగారం అపహరణ

కొమురవెల్లిలో ఆదివారం జరిగిన మల్లన్న కల్యాణాన్ని తిలకించేందుకు తోటబావి ప్రాంగణానికి వచ్చిన ఇద్దరు మహిళల నుంచి బంగారం అపహరించారు. మూటకోడూరు గ్రామానికి చెందిన వృద్ధురాలు ప్రమీల మెడలోని 3తులాల బంగారు గొలుసును గుర్తుతెలియని ఆగంతకులు అపహరించారు. కల్యాణానంతరం బయటకు చేరుకున్న అనంతరం మెడలో కనిపించకపోయేసరికి బోరున విలపించింది. చేర్యాల గ్రామానికి చెందిన లక్ష్మీనర్సమ్మ రెండు తులాల పుస్తెలతాడు దొంగతనానికి గురైంది.

కొత్త ప్రభుత్వం.. కొత్త సమస్యలు

- నేడు సంగారెడ్డి జిల్లా పరిషత్ సమావేశం
- హాజరుకానున్న మంత్రి దామోదర్ రాజనర్సింహ

సంగారెడ్డి టౌన్, జనవరి 7: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరిన అనంతరం తొలిసారి సంగారెడ్డి జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం సోమవారం జరగనున్నది. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ మంజుశ్రీ అధ్యక్షతన జరిగే సమావేశానికి రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ హాజరుకానున్నారు. ప్రస్తుతం జడ్పీ చైర్‌పర్సన్, వైస్‌చైర్మన్‌తో పాటు అత్యధిక జడ్పీటీసీలు బీఆర్‌ఎస్‌కు చెందినవారే. కాంగ్రెస్ ప్రభుత్వం రావడం, మంత్రి దామోదర్ హాజరుకానుండడంతో జిల్లాలో నెలకొన్న సమస్యలపై సభ్యులు ఎలా స్పందిస్తారోననే ఆసక్తి నెలకొన్నది.

ప్రస్తావన సరే.. పట్టింపేదీ?

ప్రతీ మూడు నెలలకోసారి జడ్పీ సర్వసభ్య సమావేశాలు నిర్వహిస్తారు. సమావేశాల్లో సభ్యులు ప్రస్తావిస్తున్న సమస్యలు మాత్రం ఏళ్ల తరబడి పరిష్కారానికి నోచుకోవడం లేదు. 2021లో ఎస్సీ కార్పొరేషన్ కింద సబ్సిడీ రుణాల పంపిణీ కోసం లబ్ధిదారులను ఎంపిక చేసినప్పటికీ ఇప్పటివరకు రూపాయి కూడా ఇవ్వలేదు. జిల్లాలో బీసీ సంక్షేమశాఖ ద్వారా 2019లో సాయం కోసం 10 వేల మంది చిరు వ్యాపారులు దరఖాస్తులు చేసుకోగా కొందరికి మాత్రమే రూ.50 వేల చొప్పున ఇచ్చి చేతులు దులుపుకున్నారు. సంగారెడ్డి మండలం హనుమాన్‌నగర్, ఇస్మాయిల్‌ఖాన్‌పేట, గుడితండా, ఫసల్‌వాది తదితర ప్రాంతాల్లోని అసైన్డ్ భూముల్లో అక్రమణ జరుగుతున్న విషయంపై జడ్పీటీసీలు అధికారుల దృష్టికి తీసుకొచ్చినా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఆరోపణలున్నాయి.



సంగారెడ్డి జిల్లా పరిషత్ కార్యాలయం

నిధులు లేక ముందుకు సాగని పనులు

పాఠశాలల్లో 'మన ఊరు.. మన బడి' పనులు, రహదారులు, వంతెనల నిర్మాణాలు, మరమ్మతులు తదితర పనులకు గతంలోనే నిధులు మంజూరైనా తీవ్రమైన జాప్యం జరుగుతున్నది. ప్రత్యేక అభివృద్ధి నిధులు కింద ప్రతీ గ్రామానికి రూ.20 లక్షల చొప్పున నిధులు మంజూరైనా పనుల్లో కదలిక లేకపోవడం గమనార్హం. పీహెచ్‌సీ, ఆరోగ్య ఉపకేంద్రాలు, భవన నిర్మాణ పనుల్లోనూ తీవ్ర జాప్యం జరుగుతున్నది. జిల్లా పరిషత్‌కు రావల్సిన సీనరేజీ గ్రాంట్లు, స్టాంపుడ్యూటీ, వినోద, వృత్తి పన్నులు, సాధారణ నిధులు మూడేళ్లుగా కేటాయించడం లేదు. దీంతో అభివృద్ధి పనులు ముందుకు సాగడంలేదు.

బీఆర్‌ఎస్ బలోపేతానికి సమష్టిగా కృషిచేద్దాం

- స్థానిక సంస్థల ఎన్నికల్లో అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేయండి
- బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్

జహీరాబాద్, జనవరి 7 : బీఆర్‌ఎస్‌ను సంస్థాగతంగా బలోపేతం చేసుకున్నప్పుడే మరింత పటిష్ఠవంతంగా తయారవుతుందని, దీని కోసం సమష్టిగా కృషి చేయాలని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో జహీరాబాద్ పార్లమెంట్ సెగ్మెంట్ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ జహీరాబాద్ పార్లమెంట్ ఎన్నికలు, స్థానిక సంస్థల ఎన్నికలు త్వరలో జరుగనున్న నేపథ్యంలో అభ్యర్థుల గెలుపు కోసం అందరూ కలిసికట్టుగా పనిచేయాలన్నారు. మున్ముందు క్షేత్రస్థాయిలో నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. పార్లమెంట్ ఎన్నికల్లో జహీరాబాద్ ఎంపీగా బీఆర్‌ఎస్ అభ్యర్థి తప్పకుండ విజయం సాధిస్తారని ధీమా వ్యక్తంచేశారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, కౌన్సిలర్లు చేపట్టాల్సిన విధివిధానాలపై ఈ సందర్భంగా దిశానిర్దేశం చేశారు. కార్యకర్తల మధ్య ఉన్న విబేధాలను సామరస్యంగా పరిష్కరించుకుని ముందుకుసాగాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు వేముల ప్రశాంత్‌రెడ్డి,



హైదరాబాద్‌లో నిర్వహించిన జహీరాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గ సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు

సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, మాజీ స్పీకర్‌లు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, మధుసూదనాచారి, జహీరాబాద్ ఎంపీ బీబీపాటిల్, ఎమ్మెల్యేలు మాణిక్‌రావు, చింతా ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యేలు క్రాంతికిరణ్, భూపాల్‌రెడ్డి, జడ్పీ చైర్మన్లు, మేయర్లు, మాజీ మేయర్లు, మున్సిపల్ చైర్మన్‌లు, జిల్లాల, నియోజకవర్గాల ఇన్‌చార్జీలు, పార్టీ అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

హిజ్రాగా మారి.. భార్యకు వేధింపులు

- బిడ్డను అప్పగించాలని తరచూ వాగ్వాదం
- పరువు తీస్తున్నాడని రగిలిపోయిన భార్య
- సన్నిహితుడితో కలిసి భర్త హత్యకు స్కెచ్
- ఓ వ్యాపారితో రూ.18 లక్షలకు ఒప్పందం
- గత నెలలో హత్య.. ఛేదించిన సిద్దిపేట పోలీసులు

సిద్దిపేట క్రైం, జనవరి 7 : సాఫీగా సాగిపోతున్న సంసారంలో అదనపు కట్నం చిచ్చు రేపింది. గొడవలు ఎక్కువై.. దంపతులు విడిపోయారు. అంతలోనే.. ఆ భర్త ప్రవర్తనలో అసహజమైన మార్పు వచ్చింది. అతడిలో అమ్మాయి లక్షణాలు ఎక్కువ కావడంతో హిజ్రాగా మారిపోయాడు. ఆపై.. తరచూ భార్య వద్దకు వెళ్లి.. తన కూతురిని ఇచ్చేయాలని వేధించడం మొదలుపెట్టాడు. దీంతో అందరి ముందూ పరువుపోతోందని భావించిన ఆ భార్య.. హిజ్రాగా మారిన భర్తను చంపేయాలని పథకం వేసింది. తాను సన్నిహితంగా ఉంటున్న ఓ వ్యక్తితో కలిసి భర్తను అంతమొందించింది. గత నెల 12న జరిగిన ఈ హత్య మిస్టరీని సిద్దిపేట వన్ టౌన్ పోలీసులు ఛేదించారు. సీఐ కృష్ణారెడ్డి కేసు వివరాలను ఆదివారం మీడియాకు వెల్లడించారు. సిద్దిపేటలోని నాసర్‌పురకు చెందిన దరుపల్లి వెంకటేశ్‌కు బోయగల్లికి చెందిన వేదశ్రీతో 2014లో పెళ్లి జరిగింది. 2015లో వీరికి పాప పుట్టింది. అనంతరం అదనపు కట్నం తేవాలని వేదశ్రీని వెంకటేశ్ వేధించేవాడు. దీంతో ఆమె భర్తను వదిలేసి కూతురితో వేరుగా ఉంటోంది. ఈ క్రమంలో వెంకటేశ్ ప్రవర్తన పూర్తిగా మారిపోయింది. చెవులకు కమ్మలు, ముక్కు పుడక పెట్టుకొని రాత్రి వేళల్లో ఆడవారి దుస్తులు ధరిస్తూ ఉండేవాడు. ఈ క్రమంలో 2019లో వెంకటేశ్ హిజ్రాగా మారి రోజాగా పేరు మార్చుకున్నాడు. పలుమార్లు చీర కట్టుకొని వేదశ్రీ పని చేస్తున్న ప్రైవేట్ స్కూలు వద్దకు వెళ్లి తన పాపను ఇవ్వాలని వేధించేవాడు. వేదశ్రీ కొంతకాలంగా పట్టణానికి చెందిన బోయని రమేశ్‌తో సన్నిహితంగా ఉంటుంది. అతడితో కలిసి రోజాను హత్య చేయాలని పథకం వేసింది. ఇందుకోసం సిద్దిపేటకు చెందిన చెప్పుల వ్యాపారి పి.రమేశ్‌ను సంప్రదించింది. వెంకటేశ్(రోజా)ను హత్య చేయడానికి 2023 సెప్టెంబరులో రూ.18 లక్షలకు



నిందితురాలు వేదశ్రీ, రోజా అలియాస్ వెంకటేశ్

ఒప్పందం కుదుర్చుకున్నారు. అడ్వాన్స్‌గా వేదశ్రీ రూ.2 లక్షలు చెల్లించింది. ఈ క్రమంలో వ్యాపారి రమేశ్ తన మిత్రుడైన నంగునూరు మండలం నాగరాజుపల్లికి చెందిన ఇప్పల శేఖర్‌కు హత్య విషయం చెప్పాడు. వారు వేసుకున్న పథకంలో భాగంగా శేఖర్.. వెంకటేశ్(రోజా)ను పరిచయం చేసుకొని రోజూ కలుస్తూ ఉండేవాడు. శేఖర్, వేదశ్రీ, వ్యాపారి రమేశ్ ముందుగా వేసుకున్న పథకం ప్రకారం డిసెంబరు 11న వెంకటేశ్(రోజా)కు మద్యం తాగించారు. ఆ రోజు రాత్రి ఇప్పల శేఖర్ మరో ఇద్దరు నిందితులతో కలిసి దిండుతో వెంకటేశ్(రోజా) ముఖంపై ఒత్తి పట్టి ఊపిరాడకుండా చేసి హత్య చేశారు. రెండు రోజుల తర్వాత వేదశ్రీ రూ.2.60 లక్షలను నిందితులకు ఇచ్చింది. వెంకటేశ్(రోజా) సోదరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన వన్ టౌన్ పోలీసులు దర్యాప్తు మొదలుపెట్టారు. పోస్టుమార్టం రిపోర్టులో హత్య అని తేలడంతో వేదశ్రీని అదుపులోకి తీసుకుని విచారించారు. దీంతో హత్య చేయించినట్లు ఆమె ఒప్పుకుంది. ఈ కేసులో ఆరుగురు నిందితులపై కేసు నమోదు కాగా.. వేదశ్రీ, ఇప్పల శేఖర్, బోయిన రమేశ్‌ను శనివారం రాత్రి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వ్యాపారి పి.రమేశ్‌తో పాటు మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నారు.

దైవం.. జ్ఞాన స్వరూపం

● పుష్పగిరి పీఠాధిపతి విద్యా శంకర భారతి స్వామి



పీఠాధిపతి సమక్షంలో పూర్ణాహుతి నిర్వహిస్తున్న దృశ్యం

కొండపాక, జనవరి 7: దైవం జ్ఞాన స్వరూపమని, ప్రతీ వ్యక్తి భక్తి భావాన్ని పెంపొందించుకుంటే జ్ఞాన సముపార్జన కలుగుతుందని పుష్పగిరి పీఠాధిపతి విద్యాశంకర భారతిస్వామి ఉద్బోధించారు. కొండపాక ఆనంద నిలయం ఆవరణలో గల అష్టాదశ శక్తి పీఠ సహిత ఉమా రామలింగేశ్వరస్వామి ఆలయం మండల పూజా కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. విద్యాశంకర భారతిస్వామి పర్యవేక్షణలో శివ కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం పుష్పగిరి పీఠాధిపతి భక్తులనుద్దేశించి అనుగ్రహ భాషణం చేశారు. ప్రతీ వ్యక్తి పరమాత్మను చేరుకోవడానికి మంచి అలవాట్లను కలిగి ఉండాలని తెలిపారు. భక్తిని పెంచుకుంటే జ్ఞానము, వైరాగ్యము వస్తాయన్నారు. పరమాత్మ ప్రేరణతో మంచి పనులు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఆలయంలో పంచసూక్త హోమాలు, మూల మంత్ర హోమాలు, బలిహరణ పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చారణ మధ్య శివపార్వతుల కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ట్రస్టు ప్రతినిధులు అయిత నాగరాజు గట్టు రవీందర్, భక్తులు పాల్గొన్నారు.

నాచగిరి, కొండపోచమ్మ.. క్షేత్రాల్లో భక్తుల సందడి







నాచగిరి క్షేత్రంలో మూలవిరాట్ లక్ష్మీనృసింహుడిని దర్శించుకుంటున్న భక్తులు, కొండపోచమ్మ ఆలయంలో బారులు తీరిన భక్తులు

వర్గల్, జనవరి 7: జిల్లాలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలైన నాచగిరి నృసింహస్వామి, కొండపోచమ్మ క్షేత్రాలు ఆదివారం భక్తులతో కిటకిటలాడాయి. సెలవురోజు కావడంతో అధికసంఖ్యలో ప్రజలు దైవదర్శనానికి బారులు తీరారు. వర్గల్ మండలం నాచగిరి క్షేత్రంలో భక్తులు తెల్లవారుజామునే ఆలయ పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామివారి దర్శనం కోసం ఆలయం వద్ద ఏర్పాటు చేసిన క్యూలైన్లలో బారులు తీరారు. భక్తుల రద్దీ దృష్ట్యా ఆలయం వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి అన్నపూర్ణ తెలిపారు.

సత్యాత్మ తీర్థ శ్రీపాదులవారి పూజలు

వర్గల్ మండలం నాచగిరి లక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలోని శ్రీ రాఘవేంద్ర బృందవనానికి జగద్గురువ శ్రీ ఉత్తరాధి మఠాధిపతి శ్రీ సత్యాత్మ తీర్థ శ్రీపాదులవారు ఆదివారం విచ్చేశారు. స్వామివారికి తెలంగాణ మధ్వ మండలి, రాఘవేంద్ర బృందావనం సమితి ఆధ్వర్యంలో పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఏకాదశి పర్వదినం సందర్భంగా స్వామివారు భక్తులకు ముద్రధారణ చేశారు. అనంతరం రాఘవేంద్ర బృందవనంలో పునర్నిర్మాణం చేసిన పనులను ప్రారంభించారు. శ్రీమఠంలోని మూల రామపూజ నిర్వహించారు. కార్యక్రమంలో కార్యక్రమ నిర్వాహకులు నందగిరి ఉపేందర్‌రావు, బృందావనం చైర్మన్ మొలుగు ప్రవీణ్‌కుమార్, కార్యదర్శి శ్రీధర్, గోవర్ధన్, భక్తులు పాల్గొన్నారు.

కొండపోచమ్మకు బోనాల సమర్పణ

జగదేవ్‌పూర్, జనవరి 7: కొమురెల్లి మల్లన్న కల్యాణోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం జగదేవ్‌పూర్ మండలంలోని తిగుల్ నర్సాపూర్ గ్రామ సమీపంలో గల శ్రీ కొండపోచమ్మ ఆలయం భక్తులతో కిటకిటలాడింది. మధ్యాహ్నం భక్తులు భారీ సంఖ్యలో అమ్మవారి సన్నిధికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వందలాది మంది భక్తులు కొండపోచమ్మ వద్దకు చేరుకుని పోతరాజుల నృత్యాలు, శివసత్తులు శిగాలు, డప్పు చప్పుళ్ల మధ్య బోనాన్ని అమ్మవారికి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ సిబ్బంది తగిన ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో మోహన్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

మైనంపల్లిని కలిసిన దరిపల్లి చంద్రం



హైదరాబాద్‌లో మాజీ ఎమ్మెల్యే మైనంపల్లితో దరిపల్లి చంద్రం తదితరులు

సిద్దిపేట టౌన్, జనవరి7: రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు, మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతురావును ఆదివారం హైదరబాద్‌లో పీసీసీ సభ్యుడు దరిపల్లి చంద్రం మర్యాదపూర్వకంగా కలిశారు. సిద్దిపేట నియోజకవర్గంలో ఉన్న సమస్యలను మైనంపల్లి హనుమంతురావు దృష్టికి తీసుకెళ్లారు. సిద్దిపేట జిల్లాకు సంబంధించి రెండేళ్లుగా అపరిష్కృతంగా ఉన్న ఉపాధ్యాయ దంపతుల బదిలీల గురించి వివరిస్తూ, ఈ విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్ళి సమస్య పరిష్కరించేలా చొరవ చూపాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు వెంకట్, శ్రీకాంత్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన కొన్నె సర్పంచ్ వెంకట్



కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న కొన్నె సర్పంచు వేముల వెంకట్ తదితరులు

చేర్యాల, జనవరి 7: జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం కొన్నె గ్రామ సర్పంచు వేముల వెంకట్, మాజీ సర్పంచు చెవిటి ఆనందం తదితరులు బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరారు. చేర్యాలలో ఆదివారం డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి సమక్షంలో వారు కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకున్నారు.

ఆర్టీసీ కార్మికుల వనభోజనాలు



వనభోజనాల్లో పాల్గొన్న ఆర్టీసీ కార్మికులు

హుస్నాబాద్ టౌన్, జనవరి 7 : హుస్నాబాద్ ఆర్టీసీ డిపో కార్మికులు వనభోజనాలను ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కార్మికులు, సిబ్బంది ఆటపాటలతో గడిపారు. విధి నిర్వాహణలో ప్రతిభ కనబర్చిన కార్మికులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ డి వెంకటేశ్వర్లు, సూపరింటెండెంట్ నర్సయ్య లక్ష్మారెడ్డి తదితరులున్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

గజ్వేల్ రూరల్, జనవరి 7: గజ్వేల్ పట్టణంలోని విశ్వతేజ జూనియర్ కళాశాలో 2003-05 బ్యాచ్ ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులు ఆదివారం సందడి చేశారు. 20 ఏళ్ల తర్వాత గజ్వేల్‌లోని ఓ గార్డెన్ ఫాంహౌస్‌లో సమ్మేళనం జరుపుకున్నారు. గత జ్ఞాపకలను గుర్తుచేసుకుంటూ రోజంతా ఆట పాటలతో సంతోషంగా గడిపారు. పరస్పరం యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. తమకు చదువు చెప్పిన గురువులకు శాలువాలు కప్పి సన్మానించారు.

ఆదర్శ హమాలీ కార్మిక సంఘం గౌరవ అధ్యక్షుడిగా శివయ్య



గౌరవ అధ్యక్షుడిగా ఎన్నికైన సింగిల్‌విండో చైర్మన్ శివయ్యను సన్మానిస్తున్న హమాలీ సంఘం నాయకులు

హుస్నాబాద్, జనవరి 7 : హుస్నాబాద్ ఆదర్శ హమాలీ కార్మిక సంఘం గౌరవ అధ్యక్షుడిగా సింగిల్‌విండో చెర్మన్ బొలిశెట్టి శివయ్యను ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘ అధ్యక్ష, కార్యదర్శులు మౌటం సారయ్య, కార్యదర్శి చెన్నవేని దేవేందర్ తెలిపారు. ఈ సందర్భంగా శివయ్యను సన్మానించారు. హమాలీ కార్మికుల సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానని ఈ సందర్భంగా శివయ్య తెలిపారు.

కాళ్లకల్ లక్ష్మీనృసింహుడి ఆలయంలో ధనుర్మాసోత్సవాలు



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న భక్తులు

మనోహరాబాద్, జనవరి 7: మనోహరాబాద్ మండలం కాళ్లకల్ గ్రామ శివారులోని స్వయంభూ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో ఆదివారం ధనుర్మాసోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవాలలో భాగంగా ఆలయం వద్ద వనభోజనాలు చేశారు. అనంతరం స్వామివారి ఊరేగింపు నిర్వహించారు.

ఖేడ్ నుంచి రేజింతల్‌కు దిండి పాదయాత్ర

నారాయణఖేడ్, జనవరి 7: న్యాల్‌కల్ మండలం రేజింతల్‌లోని సిద్ధి వినాయకుడి 224వ జయంతిని పురస్కరించుకుని 13 నుంచి 15 వరకు దిండి పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు కమలాపూర్ వామన్‌రావుమహరాజ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 13న ఉదయం 10 గంటలకు ఖేడ్ పట్టణంలోని మార్వాడిగల్లీలోని కాశీనాథ్ మందిర్ నుంచి పాదయాత్రీకులు బయలుదేరి, 14న సాయంత్రం 4 గంటలకు న్యాల్‌కల్ మండలం రేజింతల్ సిద్ధివినాయక ఆలయానికి చేరుకుంటారని తెలిపారు.

10న మెగా జాబ్ మేళా

● మెదక్ జిల్లా ఇంటర్ నోడల్ అధికారి సత్యనారాయణ

మెదక్ అర్బన్, జనవరి 7: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈనెల 10న మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఇంటర్ నోడల్ అధికారి సత్యనారాయణ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. హెచ్‌సీఎల్‌టెక్‌బి ప్రోగ్రాం కోసం ఈ ఏడాది ఇంటర్మీడియట్ పూర్తి చేసుకున్న ఎంపీసీ, ఎంఈసీ తోపాటు ఇంటర్ మొదటి సంవత్సరంలో 75 శాతం, మ్యాథ్స్‌లో 60 శాతం ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను ఎంపిక చేస్తారన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలో 2024 పూర్తి చేసుకోబోతున్న ఎంపీసీ, ఎంఈసీ విద్యార్థులు తమ ఆండ్రాయిడ్ మొబైల్‌తో హాజరుకావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 8074065803, 9493553821 నెంబర్లను సంప్రదించాలన్నారు.

సంగారెడ్డి జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు సర్వం సిద్ధం

● డీఈవో వెంకటేశ్వర్లు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో వెంకటేశ్వర్లు

సంగారెడ్డి అర్బన్, జనవరి 7: జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు ఏర్పాట్లు పూర్తి చేశామని డీఈవో వెంకటేశ్వర్లు తెలిపారు. సంగారెడ్డిలోని సెయింట్ ఆంథోనీస్ ఉన్నత పాఠశాలలో ఆదివారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డీఈవో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఈ నెల 8 నుంచి 10వ తేదీవరకు రాష్ట్రీయ బాల వైజ్ఞానిక ప్రదర్శనను శాంతినగర్ సెయింట్ ఆంథోనీస్ ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. హెల్త్, లైఫ్, అగ్రికల్చర్, కమ్యూనికేషన్ అండ్ ట్రాన్స్‌పోర్ట్, కాంపుటేషనల్ థింకింగ్ ఐదు ఉప అంశాలకు సంబంధించి ఎగ్జిబిట్స్‌ను ప్రదర్శించనున్నట్లు తెలిపారు. జిల్లావ్యాప్తంగా తీసుకొచ్చిన 900 పైగా ఎగ్జిబిట్లు ప్రదర్శిస్తారని పేర్కొన్నారు. రాష్ట్రీయ బాల వైజ్ఞానిక ప్రదర్శనను రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ప్రారంభిస్తారని తెలిపారు. ఈ సమావేశంలో ఏడీ శంకర్, జిల్లా సైన్స్ అధికారి విజయ కుమార్, సెక్టోరియల్ అధికారి వెంకటేశం, డీసీఈబీ సెక్రటరీ లింబాజీ, జాకీర్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

కొన్యాల పీహెచ్‌సీ సమస్యల పరిష్కారానికి మంత్రి హామీ



మంత్రి దామోదర్ రాజనర్సింహను కలిసిన కొన్యాల మాజీ సర్పంచ్

హత్నూర, జనవరి 7: హత్నూర మండల పరిధిలోని కొన్యాల గ్రామంలో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (సబ్ సెంటర్)లో పర్మినెంట్ ఏఎన్ఎంతో పాటు ఇతర సమస్యలను పరిష్కరిస్తానని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ హామీ ఇచ్చినట్లు ఆ గ్రామ మాజీ సర్పంచ్ సుజాత సత్యం తెలిపారు. మండలంలోని చీక్మద్దూర్, కొన్యాల, పన్యాల, బడంపేట్, మాధుర గ్రామాల ప్రజల సౌకర్యార్థం కొన్నినెలల క్రితం పీహెచ్‌సీ సబ్ సెంటర్ ఏర్పాటు చేసినప్పటికీ.. అక్కడ ఏఎన్ఎం లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు వారు తెలిపారు. దీంతో మంత్రి దామోదర్ రాజనర్సింహ స్పందిస్తూ పీహెచ్‌సీ సబ్ సెంటర్‌లో అవసరమైన వసతులు కల్పనతో పాటు రెగ్యులర్‌గా ఏఎన్ఎం ఉండేలా చర్యలు తీసుకుంటామని హామీఇచ్చారని స్పష్టం చేశారు.

సెలవురోజున కొనసాగిన దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియ





హుస్నాబాద్, మద్దూరు మండలాల్లో డాటాఎంట్రీ చేస్తున్న ఆపరేటర్లు

హుస్నాబాద్, జనవరి 7: హుస్నాబాద్ మున్సిపల్ కార్యాలయంలో ఆదివారం సెలవు రోజు కూడా ప్రజా పాలన దరఖాస్తుల డాటా ఎంట్రీ ఆన్‌లైన్ ప్రక్రియ కొనసాగింది. దాదాపు 20 మందికి పైగా ఆపరేటర్లు దరఖాస్తుల వివరాలను కంప్యూటర్లలో డాటా ఎంట్రీ చేశారు. ప్రజాపాలన అభయ హస్తం దరఖాస్తుల స్వీకరణ గడువు శనివారంతో ముగియగా మొత్తం 6,919 దరఖాస్తులు వచ్చాయి. ఈ నెల 17వ తేదీలోగా దరఖాస్తుల ఎంట్రీకి గడువు ఉండగా ఇప్పటి వరకు దాదాపు 2వేలకు పైగా దరఖాస్తులను పూర్తి చేశారు.

మద్దూర్‌లో సర్వర్ స్లో

మద్దూరు, జనవరి 7: ప్రజాపాలనలో ప్రజల నుంచి స్వీకరించిన అభయహస్తం దరఖాస్తులకు ఆన్‌లైన్ నమోదు చేసే క్రమంలో సర్వర్ స్లోతో ఆన్‌లైన్ ప్రక్రియ నత్తనడకన సాగుతున్నది. మండలంలోని ధర్మారంలో- 321, మద్దూరులో-898, వల్లంపట్లలో-650, వంగపల్లిలో-340, కమలాయపల్లిలో-311, అర్జున్‌పట్లలో-407, లద్నూరులో-950, మర్మాములలో-668, నర్సాయపల్లిలో-676, గాగిల్లాపూర్‌లో-739, రేబర్తిలో-1113, సలాఖ్‌పూర్‌లో-616, దూళిమిట్ట మండలంలో లింగాపూర్‌లో-449, దూళిమిట్టలో-826, జాలపల్లిలో-458, తోర్నాలలో-336, బెక్కల్‌లో-620, భైరాన్‌పల్లిలో-639, కొండాపూర్‌లో-342, దుబ్బతండాలో-278, హన్మతండాలో-289, రెడ్యానాయక్‌తండాలో-178, కూటిగల్‌లో-468తో కలిపి ఉమ్మడిమండలంలో మొత్తం 12,572 దరఖాస్తులు వచ్చాయి. అయితే ఆన్‌లైన్‌లో నమోదు చేసే క్రమంలో సర్వర్ స్లో ఉండటంతో ఆపరేటర్లకు ఇబ్బందులు తప్పడం లేదు. ఆదివారం సాయంత్రం వరకు సుమారు మద్దూరు మండలంలో 1,152, దూళిమిట్ట మండలంలో 780తో కలిపి మొత్తం 1,932 దరఖాస్తులను ఆన్‌లైన్ చేసినట్లు ఎంపీడీవో శ్రీనివాస్ తెలిపారు. ఆపరేటర్లు ఆన్‌లైన్ నమోదు చేసేటప్పుడు ఎలాంటి తప్పులు లేకుండా నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో సెక్రటరీలు, ఆపరేటర్లు ఉన్నారు.

వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ మాజీ ఎంపీ వినోద్‌కుమార్

హుస్నాబాద్‌రూరల్, జనవరి 7: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా పార్టీ కార్యకర్తలంతా కలిసికట్టుగా పనిచేయాలని కరీంనగర్ మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఆదివారం పోతారం(ఎస్) శుభం గార్డెన్‌లో మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్ అధ్యక్షతన హుస్నాబాద్ నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి మాజీ ఎంపీ వినోద్‌కుమార్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత పదేళ్లుగా సీఎం కేసీఆర్ ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొని రాష్ట్రాన్ని అభివృద్ధిపథంలోకి తెచ్చారన్నారు. గత ఏడాది డిసెంబరు వరకు లక్షా 61వేల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించామన్నారు. కాని ఉద్యోగాలు ఇవ్వలేదని కాంగ్రెస్ దుష్ప్రచారం చేసిందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చినఅబద్ధాల బండారమంతా ఈ యాసంగి వడ్ల కొనుగోళ్లలో బయటపడుతుందన్నారు. రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఎప్పుడు ఇస్తారో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బీఆర్ఎస్‌పై తప్పుడు ఆరోపణలు చేసి అధికారంలోకి వచ్చిందని, వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటిచేప్పేందుకు ప్రతీ కార్యకర్త ఒక సైనికుడిలా పనిచేయాలని సూచించారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించుకోవడం కోసం గ్రామ గ్రామాన ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేస్తామని మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్ పేర్కొన్నారు. పొట్లపల్లి ఆలయంలో రాసిఇచ్చిన హామీలను మంత్రి పొన్నం ప్రభాకర్ వంద రోజుల్లో పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. పార్లమెంట్ ఎన్నికలతో పాటు వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో "బీఆర్ఎస్ గెలుస్తుందన్న ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో హన్మకొండ జడ్పీ చైర్‌పర్సన్ డాక్టర్ సుధీర్‌కుమార్, కరీంనగర్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, సీనియర్ రాష్ట్ర నాయకులు కర్ర శ్రీహరి, పన్యాల భూపతిరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత, వైస్‌చైర్‌పర్సన్ అయిలేని అనిత, ఎంపీపీలు లకావత్ మానస, మాలోతు లక్ష్మి, కొత్త వినీతశ్రీనివాస్‌రెడ్డి, నవ్య, జడ్పీటీసీలు భూక్య మంగ, ఏఎంసీ చైర్మన్ ఎ రజిత, మండల పార్టీ అధ్యక్షుడు వంగ వెంకట్రామిరెడ్డి, కౌన్సిలర్లు, గ్రామశాఖల అధ్యక్షుడు తదితరులు పాల్గొన్నారు.

రామచంద్ర మూర్తి భావితరాలకు ఆదర్శప్రాయుడు



సంస్మరణ సభలో మాట్లాడుతున్న సర్పంచ్ మహాదేవ్ గౌడ్

కొండపాక, జనవరి 7 : ఆలయ పునరుద్ధరణ చేపట్టి భక్తిభావాన్ని పెంపొందించడంతోపాటు అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించిన కొండపాక మండలం దుద్దెడ శంభు దేవాలయ ట్రస్టు చైర్మన్ రామచంద్రంమూర్తి శర్మ భావితరాలకు ఆదర్శప్రాయుడని పలువురు కొనియాడారు. దుద్దెడ శంభు ఆలయ ఆవరణలో రామచంద్రమూర్తి సంస్మరణ సభను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. శ్రీ స్వయంభూ శంభు లింగేశ్వర సేవా సమితి ట్రస్టు ఆధ్వర్యంలో రామచంద్రమూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మార్గదర్శనంలో శంభుని ఆలయాన్ని మరింత అభివృద్ధి చేస్తూ, గ్రామంలో పాఠశాలల అభివృద్ధికి కృషి చేస్తామని ట్రస్టీలు పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆరెపల్లి మహాదేవ్‌గౌడ్, ట్రస్టు ప్రధాన కార్యదర్శి మంచాల శ్రీనివాస్, ఉపాధ్యక్షులు పెద్దంకుల శ్రీనివాస్, అనంతల నరేందర్, సలహాదారు నర్ర రాఘవరెడ్డి, ఉపసర్పంచ్ గుండెల్లి ఆంజనేయులు, బంధువులు రఘురామశర్మ, విఠల్ శర్మ, లక్ష్మి నరసింహం, నాయకులు నూనె కుమార్ యాదవ్, ట్రస్టు సభ్యులు మంచాల చిన్న శ్రీనివాస్, బూరుగుల వెంకటరమణ, దేశాయిరెడ్డి, రాజయ్య, కోట శ్రీనివాసశర్మ, అర్చకులు వ్యాస నారాయణ, తమ్మలి శంకరయ్య, పెద్ది కుమార్ అమిరిశెట్టి వెంకటేశం తదితరులు పాల్గొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేశారు.

విద్యారంగాన్ని బలోపేతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న మాణిక్‌రెడ్డి

సంగారెడ్డి రూరల్, జనవరి 7: ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేసేందుకు వెంటనే మెగా డీఎస్సీ వేయాలని టీఎస్‌యూటీఎఫ్ మాసపత్రిక వాయిస్ ఆఫ్ తెలంగాణ టీచర్ రాష్ట్ర ప్రధాన సంపాదకుడు పాపన్నగారి మాణిక్‌రెడ్డి, యూటీఎఫ్ రాష్ట్ర కోశాధికారి లక్ష్మారెడ్డి అన్నారు. సంగారెడ్డిలోని కేవల్‌కిషన్ భవన్‌లో ఆదివారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని, మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా విద్యకు 15 శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల ప్రధాన సమస్యలైన సీపీఎస్‌ను రద్దు చేయాలని, పదోన్నతులు, బదిలీలు వెంటనే చేయాలన్నారు. జీవో 317 బాధితులకు న్యాయం చేయాలని వారు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జ్ఞానమంజరి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అశోక్, సాయిలు, రాష్ట్ర కమిటీ సభ్యులు శామయ్య అమరేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ అయోధ్య రాముడి అక్షింతలు





నారాయణరావుపేట, కుకునూరుపల్లి మండలంలోని లకుడారంలో ఇంటింటికీ అయోధ్య అక్షింతలను అందజేస్తున్న బాధ్యులు

నారాయణరావుపేట, జనవరి 7: నారాయణరావుపేట మండల కేంద్రంలో ఆదివారం అయోధ్య శ్రీరాముడి అక్షింతలతో పాటు భవ్య రామమందిర నిర్మాణం నమూనాను అందజేశారు. శ్రీ రాముడి అక్షింతలు ఇంటి ముందుకు తీసుకురాగానే మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికి అక్షింతలు స్వీకరించారు. 22న అయోధ్యలో శ్రీ రాముడి ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమం అనంతరం గ్రామాల్లో ప్రతీ ఇంట్లో దీపాలు వెలిగించి పండుగ జరుపుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు గడ్డం శ్రీకాంత్ గౌడ్, కూరపాటి గణేష్, పోశెట్టి భాస్కర్, దొంగల బాపురెడ్డి, బగ్గ రాజేశం, ఎల్లారెడ్డి, బాల్‌రెడ్డి, గండ్ల సంతోష్, జిల్లేల రమేష్, పొన్నాలబాబు, కర్రెన రాజు, సాయి, గడ్డం నవీన్, రాకేష్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

● కొండపాక: అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలను పలు గ్రామాల్లో శోభాయాత్ర నిర్వహించడంతోపాటు ఇంటింటికీ అందజేశారు. కుకునూరు పల్లి మండలంలోని లకుడారం గ్రామంలో ఆలయాల్లో అక్షింతల కలశాలకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఇంటింటికీ అక్షింతలను అందజేశారు.

● హుస్నాబాద్‌రూరల్: అయోధ్య ట్రస్టు ఆధ్వర్యంలో అయోధ్య పూజిత అక్షింతలను ఆదివారం గడపగడపకూ అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దేవసాని సుశీల, వైస్ ఎంపీపీ దేవసాని నిర్మల, సుంకరి కిష్టయ్య, కానుగుల మోహన్, మార్క చంద్రయ్య, కర్ర రవీందర్‌రెడ్డి, మార్క అనిల్, శ్రీనివాస్‌రెడ్డి, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

● గజ్వేల్ రూరల్: అయోధ్య నుంచి చేరుకున్న శ్రీరాములవారి అక్షింతలను ఆదివారం మండలంలోని అహ్మదీపూర్‌లో మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షుడు శ్రీనివాసు ఆధ్వర్యంలో గ్రామ పురవీధుల గుండా ప్రత్యేక వాయిద్యాల నడుమ హనుమాన్ ఆలయం వరకు ఊరేగించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ అక్షింతలను ఇంటింటికీ భక్తులకు పంపిణీ చేస్తామన్నారు.

108 మంది భక్తులతో శ్రీరామరక్షా స్తోత్ర పారాయణం

గజ్వేల్ రూరల్, జనవరి 7: ఈ నెల 22న జరిగే అయోధ్య రాముని విగ్రహ ప్రాణప్రతిష్ఠ నేపథ్యంలో గజ్వేల్ శ్రీ రామకోటి భక్త సమాజం వ్యవస్థాపక అధ్యక్షుడు రామకోటి రామరాజు ధార్మిక సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక మురళీకృష్ణ ఆలయ ఆవరణలో గల రామాలయంలో 108మంది భక్తులతో శ్రీరామరక్షాస్తోత్ర పారాయణం నిర్వహించారు. అనంతరం ఆలయంలో కొలువుదీరిన సీతారాముల ప్రతిమలకు పంచామృత అభిషేకాలు చేసి పూలతో అందంగా అలకరించి హారతి ఇచ్చారు. తీర్థ, ప్రసాద వితరణ అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయకమిటీ అధ్యక్షుడు రామచంద్రం, సభ్యులు వెంకటేశం, మైత్రాములు, ఉప్పల మధు, శివకుమార్, దశరథం, నాగేంద్రం, బండి శ్రీనివాసు, మహంకాళి శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.





హుస్నాబాద్ మండలం పొట్లపల్లి, గజ్వేల్ మండలం అహ్మదీపూర్‌లో అయోధ్య అక్షింతల కలశాలతో శోభాయాత్ర



గజ్వేల్‌లో శ్రీరామరక్షా స్తోత్ర పారాయణం చేస్తున్న భక్తులు